సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం ׀ 24 ׀ మార్చి ׀ 2025



'హోమియో'కు ఆదరణ

హోమియో వైద్యానికి ఆదరణ పెరుగుతోంది. బాధితులు ప్రభుత్వ వైద్య కేంద్రాల్లో చికిత్స పొందుతున్నారు.

8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సోమవారం సా॥) 6.26

సహర్ (మంగళవారం ఉ॥) 4.53

వాతావరణం

గరిష్టం / కనిష్టం 37° / 22°

జిల్లాలో సోమవారం పగటిపూట అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. సాయంత్రం వరకు వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఘనంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి నిత్యకల్యాణ వేడుక ఆదివారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన, తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు.

శ్రీ సీతారామచంద్రస్వామి వారికి గోటి తలంబ్రాల సమర్పణ

భద్రాచలంటౌన్: భద్రాచలం రామాలయంలో జరిగే స్వామివారి కల్యాణంలో వినియోగించే తలంబ్రాలను భక్తులు ఆదివారం సమర్పించారు. భూపాలపల్లి జిల్లా చెల్పూర్ గ్రామానికి చెందిన భక్త రామదాసు భక్త మండలి సభ్యులు స్వామివారి ప్రత్యేక పండించిన కోటి వరి ధాన్యం గింజలను భక్తి శ్రద్ధలతో గోటితో ఒలిచి ఆలయానికి తీసుకొచ్చి అప్పగించారు. వీరు ఎనిమిదేళ్లుగా తలంబ్రాలు అందజేస్తున్నారు. ఆలయ పీఆర్వో సాయిబాబా, భక్త మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో రంగారెడ్డి ఎస్పీ పూజలు

భద్రాచలంటౌన్: శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానాన్ని రంగారెడ్డి ఎస్పీ పరితోష పంకజ్ ఆదివారం కుటుంబ సమేతంగా సందర్శించారు. అంతరాలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ అధికారులు ఎస్పీకి స్వామివారి జ్ఞాపికతో పాటు ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐ రమేష్, ఎస్ఐ మధు ప్రసాద్, ఆలయ పీఆర్వో సాయిబాబా, వేద పండితులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి విశేషపూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి ఆదివారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. క్యూలైన్ ద్వారా భక్తులు అమ్మవారిని దర్శించుకోగా, అర్చకులు విశేష పూజలు జరిపారు. భక్తులు అన్నప్రాసనలు, ఒడిబియ్యం, పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పూజా కార్యక్రమంలో అర్చకులు, ఈఓ ఎన్.రజనీకుమారి పాల్గొన్నారు.

నేడు ప్రజావాణి

సూపర్‌బజార్(కొత్తగూడెం): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు అందజేయాలని కోరారు.

ఆలయానికి రూ.1.20 లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

జూలూరుపాడు: పాపకొల్లు శ్రీ ఉమాసోమలింగేశ్వర ఆలయ అభివృద్ధి, మరమ్మతులకు గ్రామానికి చెందిన బండ్ల వెంకటరామ రఘు, శ్రీదేవీ దంపతులు రూ.1.20 లక్షలను ఆదివారం విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పూసాల శ్రీనివాసాచారి, బండ్ల మధుసూదన్‌రావు, నిమ్మటూరి కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమయం ఆసన్నం



వచ్చే నెల 1 నుంచి సన్నబియ్యం పంపిణీ

- జిల్లాలో 2,93,263 మంది రేషన్ కార్డుదారులకు లబ్ధి
- పంపిణీ ప్రక్రియపై కొనసాగుతున్న సమావేశాలు
- కొత్త రేషన్‌కార్డుల మంజూరుపైనా కసరత్తు



కొత్తగూడెంఅర్బన్: పేద ప్రజలకు వచ్చే నెల నుంచి ప్రభుత్వం రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం అందించనుంది. ఉగాది నుంచి రేషన్ లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తామని గతంలోనే ప్రకటించగా, దీనిపై పౌరసరఫరా శాఖ ఉన్నతాధికారులు సమావేశాలు నిర్వహిస్తూ సలహాలు, సూచనలు చేస్తున్నారు. ఇప్పటివరకు దొడ్డు బియ్యం అందిస్తుండగా కొందరు లబ్ధిదారులు తినలేక దళారులకు విక్రయిస్తున్నారు. ఏప్రిల్ నుంచి సన్న బియ్యం రానుండటంతో కార్డుదారుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

పెరగనున్న రేషన్‌కార్డులు

జిల్లాలో గత జనవరిలో 1,203 కార్డులు కొత్తగా మంజూరు చేశారు. నూతన కార్డుల లబ్ధిదారులకు ఫిబ్రవరి నుంచి బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఇందుకోసం గతం కంటే 7,152 కిలోల బియ్యాన్ని అదనంగా రేషన్‌షాపులకు సరఫరా చేస్తున్నారు. ఇక ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులు, గతంలో పెండింగ్‌లో ఉన్నవి మొత్తం కలిసి మరో 34 వేల మందికి కొత్తగా కార్డులు మంజూరు చేసే అవకాశం ఉంది. ఇప్పటికే జిల్లాలో 2,93,263 మందికి రేషన్ కార్డులు ఉన్నాయి.

జిల్లాలోని రేషన్‌కార్డుల వివరాలు

రేషన్‌షాపులు	443
ఆహారభద్రత కార్డులు	2,72,112
అంత్యోదయ	21,148
అన్నపూర్ణ కార్డులు	3
మొత్తం కార్డులు	2,93,263
ప్రతీనెల అందించే బియ్యం	5,384.762 మెట్రిక్ టన్నులు
ఇటీవల మంజూరైన కార్డులు	1203
కొత్తగా వచ్చిన దరఖాస్తులు	34,083
మార్పులు చేర్పుల దరఖాస్తులు	20,000

మార్కెట్‌లో అధిక ధరలతో..

మార్కెట్‌లో సన్నబియ్యం ధరలు ఆకాశన్నంటుతున్నాయి. క్వింటా సన్న బియ్యం రూ.6 వేల నుంచి మొదలుకుని రూ.10 వేల వరకు విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం ఏప్రిల్ నుంచి సన్నబియ్యం అందిస్తే పేద, మధ్య తరగతి ప్రజలకు ఊరట లభించనుంది. కాగా ప్రజాపాలన గ్రామసభల్లో రేషన్‌కార్డుల కోసం 34 వేల దరఖాస్తులు, మార్పులు, చేర్పుల కోసం మరో 20 వేల దరఖాస్తులు రాగా, ఆ ప్రక్రియ పూర్తి చేసే పనిలో పౌరసరఫరాల శాఖ అధికారులు నిమగ్నమయ్యారు.

ప్రభుత్వ పథకాలకు రేషన్ కార్డు ప్రామాణికం కావడంతో కార్డులేని కుటుంబాలు దశాబ్దకాలంగా ఇబ్బందులు పడుతున్నారు. స్కాలర్‌షిప్, ఆరోగ్య శ్రీ,సేవలు, ఆదాయ సర్టిఫికెట్, రుణాలు పొందలేక పోతున్నారు. ఈ క్రమంలో కొత్త కార్డుల కోసం అర్హులు ఎదురుచూస్తున్నారు.

ఏప్రిల్ నుంచే అందించే అవకాశం



జిల్లాలో ఏప్రిల్ నెల నుంచి రేషన్‌కార్డుల లబ్ధిదారులకు సన్నబియ్యం అందించే అవకాశం ఉంది. ఈ ప్రక్రియపై రాష్ట్ర అధికారులు వీడియో, టెలీకాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తున్నారు. కొత రేషన్ కార్డుల ప్రక్రియ కూడా కొనసాగుతోంది. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులు, పెండింగ్ దరఖాస్తులకు సంబంధించిన వివరాలను ఉన్నతాధికారులకు పంపించాం.

–రుక్మిణి, జిల్లా సివిల్ సప్లయీస్ అధికారి

సమన్వయంతో పనిచేయాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వేదికపై ఎంపీ బలరాం, ఎమ్మెల్యే వెంకట్రావు, కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తదితరులు

- భక్తులు ఇబ్బందులు పడకుండా చూడాలి
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- శ్రీరామనవమి ఏర్పాట్ల పరిశీలన, సమీక్ష

భద్రాచలంఅర్బన్: శ్రీరామనవమి వేడుకల విజయవంతానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. వచ్చే నెల 6,7 తేదీల్లో భద్రాచలంలో జరిగే శ్రీ సీతారామ చంద్రస్వామివారి కల్యాణం, పట్టాభిషేకం ఏర్పాట్లను ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో జిల్లాస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. అంతకు ముందు పట్టణంలోని చర్ల రోడ్డులో ఉన్న ఏఎంసీ కాలనీలో అసంపూర్తిగా ఉన్న 117 ఇందిరమ్మ ఇళ్లకు రూ.7.36 కోట్లతో మరమ్మతులకు చేయగా, మంత్రి ప్రారంభించి లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఐటీడీఏ రోడ్డులోని మనుబోతుల చెరువులో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో రూ.1.40 కోట్లతో నిర్మించిన డీఆర్‌సీసీ షెడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొనే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఎండ వేడి అధికంగా ఉన్నందున తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు భక్తులకు అందుబాటులో ఉంచాలన్నారు. విద్యుత్ నిరంతరాయంగా సరఫరా చేయాలని, వైద్య సిబ్బంది అవసరమైన మందులు, అంబులెన్స్‌లో సిద్ధంగా ఉండాలని, అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజన్లను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ఉత్సవాల సమయంలో మద్యం షాపులు మూసి వేయించాలని ఎక్సైజ్ అధికారులకు సూచించారు. శ్రీరామనవమి వేడుకలకు అధిక సంఖ్యలో భక్తులు హాజరవుతారని, అందుకు తగినట్లుగా ఏర్పాట్లు చేయాలన్నారు. వేడుకలకు సీఎం రేవంత్ రెడ్డి హాజరవుతారని, మాడవీధుల విస్తరణ పనులు కూడా ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల ఘనత కాంగ్రెస్‌దే..

ఉమ్మడి రాష్ట్రంలో 25 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టించిన ఘనత కాంగ్రెస్‌దేనని మంత్రి అన్నారు. ప్రస్తుతం ప్రతీ నియోజకవర్గంలో 3500 ఇళ్లు నిర్మించి ఇస్తామని, ఇప్పటికే సీఎం రూ.387 కోట్ల నిధులు మంజూరు చేశారని వివరించారు. గిరిజనులకు కూడా పక్కా ఇళ్లు నిర్మిస్తామని అన్నారు. రామయ్య ఆశీస్సులతో భద్రాచలం అభివృద్ధిలో దూసుకుపోతుందని తెలిపారు. అనంతరం ఐటీడీఏలో ఏర్పాటు చేస్తున్న మ్యూజియాన్ని సందర్శించారు. పెయింటింగ్ చిత్రాలు, పాతకాలపు ఇళ్లు, సెల్ఫీ పాయింట్‌ను ఆసక్తిగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బలరాం నాయక్, కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఐటీడీఏ పీఓ రాహుల్, ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, అదనపు కలెక్టర్ విద్యాచందన తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

కొత్తగూడెంఅర్బన్: రంజాన్ మాసంలో ఇచ్చే ఇఫ్తార్ విందు ఆత్మీయత, మతసామరస్యానికి ప్రతీక అని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. కొత్తగూడెం క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన విందుకు ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి, కలెక్టర్ జితేష్‌తో కలిసి హాజరయ్యారు.



ప్రార్థన చేస్తున్న మంత్రి పొంగులేటి, ఎంపీ రఘురాంరెడ్డి, మువ్వా విజయ్‌బాబు, ముస్లిం మత పెద్దలు

ఇంట్లో మొక్కలు పెంచుకోవాలి



మాట్లాడుతున్న జయరాజు, వేదికపై కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కొత్తగూడెంఅర్బన్: ఇంట్లో మొక్కలు పెంచుకుని ఆరోగ్యం కాపాడుకుందామని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. ఆదివారం ప్రకృతి ఆశ్రమం ఆధ్వర్యంలో కొత్తగూడెం క్లబ్‌లో జరిగిన ప్రకృతి–ఆరోగ్య మహాసభల్లో మాట్లాడారు. చిన్నతనంలో తన తండ్రి మొక్కలు నాటేవారని పేర్కొన్నారు. మునగ ఆకుకు ప్రపంచంలో అమితమైన డిమాండ్ ఉందని అన్నారు. మెడిసినల్ ప్లాంట్స్, కూరగాయ మొక్కలు, ఆకుకూరలను ఇంటిపంటగా పెంచుకుంటే పురుగు మందులు లేని ఆహారం తినవచ్చని చెప్పారు. ఆశ్రమ వ్యవస్థాపకుడు జయరాజు మాట్లాడుతూ గ్రీన్ ప్రపంచాన్ని నిర్మించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ఆరోగ్యం, ఆనందం కోసం ప్లాస్టిక్ నిర్మూలన చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు, సుగుణారావు, డి.సత్యనారాయణ, డాక్టర్ అనిల్ కుమార్ తంబరేణి, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సంఘం వెంకట పుల్లయ్య, శనగ వెంకటేశ్వర్లు, డాక్టర్ లక్ష్మణస్వామి, గోనే శ్రీకాంత్, టూమట్ల వెంకన్న పాల్గొన్నారు.

ప్రబంధ కథలను ఆవిష్కరించిన సీఎం



గ్రంథం ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రులు

భద్రాచలంటౌన్: భద్రాచలం దేవస్థాన వేద పండితులు ఎస్‌జీటీ కృష్ణమాచార్యులు రచించిన తెలుగు కావ్య ప్రబంధ కథలు అనే గ్రంథాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. కృష్ణమాచార్యులు పుస్తకాన్ని రాష్ట్ర సచివాలయంలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఆవిష్కరించి, విశిష్టతను వివరించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కొండ సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మ పాదాలకు వందనం

- ఇటీవల గాయపడి తల్లి మృతి
- మెటల్‌తో పాదముద్రలను తయారు చేయించిన కుమారుడు



తల్లి లక్ష్మి చిత్రపటం వద్ద ఏర్పాటు చేసిన పాదముద్రలు

పాల్వంచ: తల్లి మృతి చెందాక పాదముద్రలను మెటల్ తయారు చేయించి అమ్మపై ప్రేమను చాటుకున్నాడో కుమారుడు. పాల్వంచలో ఈ విశేషం జరిగింది. పట్టణంలోని మార్కెట్ ఏరియాకు చెందిన బాలాజీ ఫొటో స్టూడియో నిర్వాహకుడు అల్లి శరత్ తల్లి లక్ష్మి(55) ఇటీవల కిందపడి గాయపడి కోమాలోకి వెళ్లింది. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు మెదడులో రక్తం గడ్డకట్టిందని, ఎక్కువ కాలం బతకదని చెప్పారు. దీంతో కుమారుడు నిపుణులను పిలిపించి తల్లి పాదముద్రలను సేకరించి మెటల్‌తో తయారు చేయించాడు. కాళ్లకు మెట్టెలు, తల్లి పట్టీలను అమర్చాడు. కాగా లక్ష్మి మృతి చెందగా ఆదివారం సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లి ఫొటోలు, పాదముద్రలతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయగా, పలువురు ఆసక్తిగా తిలకించారు.

డయాలసిస్ సేవలు మెరుగు

- జిల్లాలో ఏడు కేంద్రాల్లో 53 యంత్రాలు
- ప్రస్తుతం చికిత్స పొందుతున్నవారు 248 మంది
- మరో 170 మందికి సేవలందించే అవకాశం



సేవలు పొందుతున్న బాధితులు

ఇల్లెందు: జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో డయాలసిస్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఏడు కేంద్రాల్లో డయాలసిస్ సౌకర్యం కల్పించారు. గతంలో డయాలసిస్ చేయాలంటే పైరవీలు చేయాల్సి వచ్చేది. లేదంటే ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లేవారు. బాధితులు వారంలో రెండు నుంచి నాలుగు దఫాలు డయాలసిస్ చేయించుకోవాల్సి ఉంటుంది. ఒక్కసారికే ప్రైవేటు ఆస్పత్రుల్లో రూ.10 వేల వరకు ఖర్చు చేయాల్సి వచ్చేది. కానీ ప్రస్తుతం జిల్లాలోని ఏడు ప్రధాన పట్టణాల్లోని ప్రభుత్వాస్పత్రుల్లో ఈ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో అవసరమైన వారందరికీ సేవలు అందుతున్నాయి. ఖాళీ బెడ్లు కూడా ఉంటున్నాయి. కొత్తగూడెం సర్వజన ఆస్పత్రి, ఇల్లెందు, భద్రాచలం, మణుగూరు, అశ్వారావుపేట ఏరియా హాస్పిటల్, చర్ల, పాల్వంచ సీహెచ్‌సీలలో డయాలసిస్ సేవలు అందిస్తున్నారు.

డయాలసిస్ సెంటర్‌లు, యంత్రాలు, ఖాళీల వివరాలు..

సెంటర్ పేరు	యంత్రాలు	బాధితులు	ఖాళీలు
జీజీహెచ్, కొత్తగూడెం	10	44	40
ఏరియా ఆస్పత్రి, భద్రాచలం	10	60	25
సీహెచ్‌సీ, పాల్వంచ	10	41	20
ఏరియా ఆస్పత్రి, ఇల్లెందు	08	32	25
ఏరియా ఆస్పత్రి, మణుగూరు	05	32	10
సీహెచ్‌సీ, చర్ల	05	10	30
ఏరియా ఆస్పత్రి, అశ్వారావుపేట	05	29	20
మొత్తం	53	248	170

సద్వినియోగం చేసుకోవాలి



జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రితోపాటు ఏరియా ఆస్పత్రులు, సీహెచ్‌సీలలో డయాలసిస్ సేవలు అందిస్తున్నాం.ప్రస్తుతం 248 మంది సేవలు పొందుతుండగా, ఇంకా 170 మంది రోగులకు సేవలు అందించే అవకాశం ఉంది. బాధితులు సద్వినియోగం చేసుకోవాలి.

–డాక్టర్ జి.రవిబాబు, డీసీహెచ్‌ఎస్

జిల్లాలో టీబీ సేవలు భేష్

రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి..



అవార్డు అందుకుంటున్న వైద్యాధికారులు

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్రస్థాయిలో క్షయ విభాగంలో ఉత్తమసేవలు అందించినందుకు జిల్లాకు రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి లభించింది. శనివారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో మెడికల్ అండ్ హెల్త్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ అనురాధ, రాష్ట్ర క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ రాజేశం చేతులమీదుగా డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కర్ నాయక్, జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ బాలాజీనాయక్ అవార్డుతోపాటు ప్రశంసాపత్రం అందుకున్నారు.

పచ్చని చెట్లను పడేశారు..



కిన్నెరసాని రోడ్డుపక్కన నరికిన చెట్లు

పాల్వంచరూరల్ : 'మొక్కలు నాటండి.. చెట్లు పెంచండి.. పర్యావరణాన్ని పరిరక్షించండి' అంటూ ప్రభుత్వం నిత్యం ప్రచారం చేస్తుంటే మరోవైపు అధికారులు, కాంట్రాక్టర్లు కలిసి పెద్ద పెద్ద వృక్షాలను నేలకూల్చుతున్నారు. పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానికి వెళ్లే రహదారికి ఇరువైపులా హరితహారంలో రూ.లక్షల వ్యయం చేసి రోడ్డు వెంట నాటిన మొక్కలు పెరిగి పెద్దవై ఆయా గ్రామాల ప్రజలకు, పర్యాటకులకు చల్లని నీడను ఇస్తున్నాయి. అయితే పాల్వంచ నుంచి కరకవాగు – కిన్నెరసాని వరకు 33 కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటుకు అడ్డొస్తున్నాయంటూ విద్యుత్ శాఖ అధికారులు రహదారిపై ఉన్న వృక్షాలను నరికేశారు. కొమ్ములు మాత్రమే కొడతామని అటవీ, ఆర్అండ్‌బీ శాఖల నుంచి అనుమతి పొందిన విద్యుత్ శాఖ అధికారులు, కాంట్రాక్టర్ గత పది రోజులుగా పది కిలోమీటర్ల దూరం వరకు చెట్లను నరికించారు. అయినా అటవీ శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నరికిన వృక్షాల కలపను సొంతానికి తరలిస్తుండగా సమాచారం అందుకున్న అటవీ అధికారులు వాటిని కలప డిపోకు తరలిస్తున్నారు. కాగా, ఈ విషయమై విద్యుత్ శాఖ కన్‌స్ట్రక్షన్‌విభాగం ఏఈ రాజేశ్‌ను మాట్లాడుతూ.. కిన్నెరసాని రోడ్డులో 33 కేవీ విద్యుత్ లైన్ నిర్మాణానికి అడ్డుగా ఉన్న చెట్లను నరికేందుకు ఆర్అండ్‌బీ, అటవీ శాఖల అనుమతి తీసుకున్నామని చెప్పారు.

క్లుప్తంగా

పర్ణశాలను సందర్శించిన న్యాయమూర్తి



అమ్మవారి నారచీరల వద్ద మెజిస్ట్రేట్

దుమ్ముగూడెం : ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల శ్రీ సీతారామ చంద్రస్వామి వారిని భద్రాచలం జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ శివనాయక్ ఆదివారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పంచవటీ కుటీరం, సీతమ్మవారి నారచీరల ప్రాంతాలను సందర్శించి వాటి విశిష్టతలను తెలుసుకున్నారు. ముందుగా అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

అథ్లెటిక్స్‌లో జిల్లాకు ఐదు పతకాలు



పతకాలు సాధించిన క్రీడాకారులతో కోచ్‌లు

కొత్తగూడెంటౌన్: తెలంగాణ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు ఐదు పతకాలు వచ్చాయని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.మహీధర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నెల 22న తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. పరుగుపందెంలో జర్పుల దీక్షిత్ బంగారు పతకం, మాలోతు సింధు రజత పతకం, డి.లోకేష్, బి.దుర్గ కాంస్య పతకాలు, జావెలిన్‌లో ఎం.కృష్ణవేణి కాంస్య పతకం సాధించారని వివరించారు. విజేతలను జిల్లా క్రీడల శాఖ అధికారి ఎం.పరంధామరెడ్డి, క్రీడా సంఘాల బాధ్యులు కె.సారంగపాణి, యుగంధర్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, రాధాకృష్ణ, పి.నాగేందర్, మల్లికార్జున్, గిరిప్రసాద్, జి.కృష్ణ, జె. నాగరాజు, కోచ్‌లు అభినందించారు.

విద్యారంగాన్ని బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న దుర్గాభవాని

ఖమ్మం సహకారనగర్ : రాష్ట్రంలో ప్రభుత్వం విద్యా రంగాన్ని మరింత బలోపేతం చేయాలని, ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులు ప్రారంభించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చావా దుర్గాభవాని కోరారు. నగరంలోని సంఘం కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. పూర్వ ప్రాథమిక పాఠశాలల వల్ల బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఆర్థిక సౌలభ్యం కలుగుతుందని, పిల్లలకు నాణ్యమైన విద్య అందుతుందని అన్నారు. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి రెండో వేతన సవరణ సంఘం రిపోర్టును తెప్పించి 2023 జూలై నుంచి నూతన పీఆర్సీ అమలు చేయాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు, వల్లకొండ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్ ప్రమాద ఘటనపై విచారణ



ప్రమాదం జరిగిన లిఫ్ట్‌ను పరిశీలిస్తున్న సైదులు

ఖమ్మంవైద్యవిభాగం : నగరంలోని ప్రసూన ఆస్పత్రిలో లిఫ్ట్ ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటనపై జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు ఆదివారం విచారణ చేపట్టారు. ఆ ఆస్పత్రిలో ఆపరేషన్ అనంతరం సరోజిని(62) అనే మహిళను ఆపరేషన్ థియేటర్ నుంచి లిఫ్ట్ ద్వారా తరలించే క్రమంలో స్ట్రెచర్ పైనే ప్రాణాలు విడిచిన విషయం విదితమే. ఈ ఘటనపై ప్రాథమిక విచారణ నిమిత్తం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సైదులు విచారణ నిర్వహించారు. ప్రమాదానికి గల కారణాలపై సిబ్బందితో ఆరా తీశారు. సాంకేతిక లోపంతో లిఫ్ట్ అదుపు తప్పి ప్రమాదానికి గురైనట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు డాక్టర్ సైదులు తెలిపారు. ఈ విషయమై జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారికి నివేదించనున్నట్లు వివరించారు. ఆస్పత్రిలో లిఫ్ట్ స్థితిగతులు, కంపెనీ వివరాలు, ఎన్ని సంవత్సరాలుగా వాడుతున్నారు, ఇంతకుముందు ఏవైనా సమస్యలు ఉన్నాయా అనే విషయాలపై నివేదిక సమర్పించాలని ఆస్పత్రి యాజమాన్యానికి నోటీసు ఇచ్చినట్లు తెలిపారు. పూర్తి నివేదిక వచ్చాక యాజమాన్యం నిర్లక్ష్యం ఉన్నట్లు తేలితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.20,871

హోమియో వైద్యానికి ఆదరణ

- మొగ్గుచూపుతున్న దీర్ఘకాలిక వ్యాధుల బాధితులు
- ఉమ్మడి జిల్లాతోపాటు ఏపీ నుంచి చికిత్స కోసం వస్తున్న రోగులు



రోగులకు సేవలు అందిస్తున్న డాక్టర్ ప్రవీణ్

చంద్రుగొండ : హోమియో వైద్యానికి రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖలో ఓ విభాగమైన హోమియో వైద్యం వైపు బాధితులు మొగ్గుచూపుతున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 20 వరకు హోమియో వైద్యకేంద్రాలు ఉన్నాయి. అశ్వారావుపేట, భద్రాచలం, పినపాక, ఇల్లెందు, చంద్రుగొండ, కల్లూరు, పెనుబల్లి, మధిర, కూసుమంచి తదితర ప్రాంతాల్లో నిర్వహిస్తున్నారు. అయితే ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాలతోపాటు ఏపీ నుంచి కూడా బాధితులు చంద్రుగొండ కేంద్రానికి వచ్చి చికిత్స పొందుతున్నారు. దీర్ఘకాలిక వ్యాధులున్నవారు వస్తున్నట్లు ఇక్కడి డాక్టర్ పానం ప్రవీణ్‌కుమార్ తెలిపారు. రోజుకు ఓపీ 150 నమోదవుతుందని, ఇప్పటివరకు ఇక్కడ 12 వేల మందికి చికిత్స పొందారని పేర్కొన్నారు. బీపీ, షుగర్, కీళ్లవాతం, థైరాయిడ్, కిడ్నీల్లో రాళ్ళు, మైగ్రెయిన్, సోరియాసిస్, తామర, సైనసిస్, ఆస్తమా జ్వరం తర్వాత వచ్చే నొప్పులు తదితర సమస్యలతో బాధపడేవారు, మహిళకు సంబంధించి అండాశయంలో నీటిబుడగలు, గర్భాశయ సమస్యలు, రుతు సమస్యలు ఉన్నవారు వచ్చి చికిత్స పొందుతున్నారు. సాధారణంగా కేంద్రం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పనిచేస్తుందని, రోగుల సంఖ్య అధికంగా ఉండటంతో ఒక్కో రోజు రాత్రి 8 గంటల వరకు వైద్యసేవలు అందిస్తున్నట్లు డాక్టర్ తెలిపారు.

వైద్యుడికి అదనంగా ఇన్‌చార్జి బాధ్యతలు

చంద్రుగొండ ఆస్పత్రిలో పనిచేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు కొన్ని నెలలక్రితం శాఖ ఉన్నతాధికారులు కల్లూరు మండలం చినకోరుకొండిలోని వైద్యకేంద్రం బాధ్యతలను అదనంగా అప్పగించారు. దీంతో వారంలో మూడు రోజులు చంద్రుగొండలో, మరో మూడురోజులు చినకోరుకొండిలో విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. ఫలితంగా ఇక్కడకు వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ద్వారా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, అయినా పరిష్కారం కాలేదని స్థానికులు పేర్కొంటున్నారు.

వెన్నెముక సమస్య..



వెన్నెముక సమస్యతో బాధపడ్తున్నా. నడవలేక పోతుండటంతో అనేక కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స తీసుకున్నా తగ్గలేదు. మూడు నెలలుగా ఇక్కడ చికిత్స పొందతున్నా. ఇప్పుడు నయమవుతోంది.

–ఇటికాల విజయ, మణుగూరు

తగ్గుముఖం పట్టింది



నేను చర్మవ్యాధితో బాధపడుతున్నాను. ఇక్కడ హోమియో చికిత్స పొంది వ్యాధి తగ్గిన వారు చెప్తే వచ్చాను. మందులు వాడుతున్నాను. కొంత తగ్గుముఖం పట్టింది.

–ఎం.తరుణ్‌సాయి, బీటెక్ విద్యార్థి, ఖమ్మం

మధుమేహంతో ఇబ్బంది



ఇద్దరం మధుమేహ వ్యాధితో ఇబ్బంది పడుతున్నాం. ఇక్కడికి వైద్యం కోసం వస్తే మందులు ఇచ్చారు. వ్యాధి తగ్గుముఖం పడ్తుందని ఆశిస్తున్నాం.

–బుడగబోయిన నాగేశ్వరరావు దంపతులు, విస్సన్నపేట, ఏపీ

కిన్నెరసానిలో జలవిహారం



జలాశయంలో బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. జిల్లాతోపాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి కూడా సందర్శకులు తరలివచ్చారు. డ్యామ్ సమీపం నుంచి జలాశయాన్ని, డీర్ పార్కులోని దుప్పులను వీక్షిస్తూ సరదాగా గడిపారు. 320 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించగా వైల్డ్‌లైఫ్ శాఖ రూ.11,465 ఆదాయం , 230 మంది బోటు షికారు చేయగా టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.11,000 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

పీస్‌రేట్ కార్మికులను ఆర్టిజన్లుగా గుర్తించాలి

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ పీస్‌రేట్ కార్మికులకు కనీస వేతనం చెల్లించడంతో పాటు ఆర్టిజన్లుగా గుర్తించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం. ప్రసాద్ డిమాండ్ చేశారు. పీసురేటు కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఆదివారం సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మీటరు రీడర్లు, బిల్ కలెక్టర్లు, స్టోర్ హమాలీలు వంటి కార్మికులకు కనీస వేతనం అమలు కావడం లేదన్నారు. ఏళ్ల తరబడి సంస్థలో పనిచేస్తున్నా గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంస్థలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

లారీ, డీసీఎం ఢీ

ఒకరు మృతి, మరో ముగ్గురికి తీవ్ర గాయాలు



ముష్టిబండ శివారులో రహదారిపై ప్రమాద దృశ్యం

దమ్మపేట: లారీ, డీసీఎం ఎదురెదురుగా ఢీకొని ఒకరు మృతి చెందగా, మరో ముగ్గురు గాయపడ్డ సంఘటన ఘటన ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... డీసీఎం కంటెయినర్ హైదరాబాద్ నుంచి వైజాగ్ వైపు వెళ్తోంది. అదే సమయంలో రాజమండ్రి నుంచి లారీ హైదరాబాద్ వైపు వస్తోంది. ఈ క్రమంలో మండలంలోని ముష్టిబండ శివారులో రాష్ట్రీయ రహదారిపై రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో డీసీఎం బోల్తా పడింది. డీసీఎం కేబిన్‌లో నాగాలాండ్‌కు చెందిన డ్రైవర్, క్లీనర్‌లు ఇరుక్కుని తీవ్రంగా గాయపడ్డారు. జేసీబీల సహాయంతో కేబిన్‌ను పెకిలించి తీయగా, అప్పటికే డ్రైవర్ ఆశిష్‌పాల్ మృతి చెందాడు. లారీ కేబిన్‌లో ఇరుక్కుపోయిన పశ్చిమబెంగాల్‌కు చెందిన డ్రైవర్ మస్తాన్, క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తంఅంబులెన్స్‌లో కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా ప్రమాదంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది.

ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య

దమ్మపేట: కుటుంబ సభ్యులు మందలించడంతో మద్యం మత్తులో ఓ యువకుడు శనివారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని పార్కలగండి గ్రామానికి చెందిన కొండ్రు శివ(19) మద్యానికి బానిసగా మారడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపం చెంది శనివారం రాత్రి ఇంటి పైకప్పు ఊచకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం తెల్లవారుజామున గమనించిన కుటుంబ సభ్యులు స్థానికుల సహాయంతో కిందకు దింపి చూడగా, అప్పటికే మృతి చెందాడు. మృతుడి తండ్రి సీతారాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై సాయికిషోర్ రెడ్డి తెలిపారు.

గోదావరిలో దూకి మరొకరు..

భద్రాచలంఅర్బన్: పట్టణంలో బ్రిడ్జిపై నుంచి గోదావరిలో దూకి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. భద్రాచలం సరిహద్దున ఉన్న ఎటపాక గ్రామానికి చెందిన అనిల్ అనే వ్యక్తి ఈ నెల 20న ఇంటి నుంచి నడుచుకుంటూ వచ్చి అదే రోజు రాత్రి బ్రిడ్జి మీద నుంచి గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం ఉదయం నదిలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు సమాచారం ఇవ్వగా, పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని ఒడ్డుకు చేర్పించారు. మృతుని వద్ద లభించిన ఆధార్ కార్డు వివరాలతో కుటుంబీకులకు సమాచారం అందించారు. కాగా అనిల్ భార్య పదేళ్ల క్రితం ఆత్మహత్య చేసుకోగా అప్పటి నుంచి మద్యానికి బానిసయ్యాడు. ఇటీవల మతిస్థిమితం కోల్పోయాడని, ఈ క్రమంలోనే ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబీకులు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో తల్లి, తనయుడు మృతి

- బైక్‌ను ఢీ కొట్టిన గుర్తు తెలియని వాహనం
- మృతులు ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా వాసులు



అరిసెపల్లి సరస్వతి (ఫైల్)



అరిసెపల్లి కృష్ణ (ఫైల్)

దమ్మపేట: గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టిన ఘటనలో తల్లి, తనయుడు మృత్యు ఒడిలోకి చేరుకున్న ఘటన దమ్మపేట మండలం గాంధీనగరం గ్రామ శివారులో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం ముష్టికుంట్ల గ్రామానికి చెందిన అరిసెపల్లి కృష్ణ(45), తల్లి సరస్వతి(65)తో కలసి ద్విచక్రవాహనంపై అశ్వారావుపేట మండలం నారంవారిగూడెం గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో గాంధీనగర్ గ్రామ సమీపంలో గుర్తు తెలియని వారిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తల్లీ, కుమారుడు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అంబులెన్స్‌లో అశ్వారావుపేటకు తరలించారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై సాయికిషోర్ రెడ్డి తెలిపారు.

బావిలో విషం.. చేపలు మృతి

నేలకొండపల్లి: మండలంలోని మోటాపురం (బీల్యాతండా) గ్రామానికి చెందిన భూక్యా వీరు అనే రైతు తన వ్యవసాయ బావిలో గతేడాది క్రితం చేప పిల్లలు పోశాడు. ప్రస్తుతం అవి ఒక్కోటి సుమారు 2 కిలోల వరకు పెరిగాయి. మరో రెండు, మూడు రోజుల్లో చేపలు పట్టి విక్రయించుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు బావిలో పురుగుల మందు కలపగా చేపలు మొత్తం ఆదివారం మృత్యువాత పడ్డాయని, దాదాపు రూ. లక్ష మేర నష్టపోయానని బాధితుడు వాపోయాడు. తనకు న్యాయం చేయాలని కోరాడు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

పాల్వంచరూరల్: కుటుంబ కలహాలతో ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆదివారం మల్లారంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని మల్లారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ శ్రీనివాస్ కుమారుడు ఈసం విజయ్ గ్రామపంచాయతీలో మల్టీపర్పస్ వర్కర్ పని చేస్తునానడు. ఇంట్లో ఉన్న పురుగుల మందుతాగి ఆపస్మారక స్థితిలోకి వెళ్లగా కుటుంబీకులు పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

మావోయిస్టుల ఆయుధ డంప్ లభ్యం



భద్రత బలగాలు స్వాధీనం చేసుకున్న ఆయుధాలు

దుమ్ముగూడెం : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా మార్కన్‌గూడ, మెట్టగూడ అటవీప్రాంతంలో మావోయిస్టులు దాచి ఉంచిన ఆయుధాల డంప్‌ను భద్రత బలగాలు ఆదివారం స్వాధీనం చేసుకున్నాయి. సీఆర్పీఎఫ్, కోబ్రా బెటాలియన్ బలగాలు సంయుక్తంగా క్యాంపు నుంచి అటవీ ప్రాంతంలో వైపు గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో ఆయుధ డంప్‌ను గుర్తించారు. భారీగా బ్యారెల్ గ్రెనేడ్ లాంచర్స్ సెల్స్, డిటోనేటర్లు, దేశీయ రైఫిళ్లు తదితర ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు.

ఆశ్రమ హాస్టల్‌లో అగ్ని ప్రమాదం



దగ్ధమైన క్రీడా వస్తువులు, పరుపులు

ములకలపల్లి: మండల పరిధిలోని కమలాపురం ఆశ్రమ హాస్టల్‌లో ఆదివారం అగ్ని ప్రమాదం జరిగింది. మొదటి అంతస్తులోని ఓ గదిలో మంటలు చెలరేగాయి. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ప్రమాదం జరిగినట్లు సమాచారం. గదిలో ఉన్న పాత పరుపులు, క్రీడా వస్తువులు దగ్ధమయ్యాయి. స్థానికులతో సమాచారంతో కొత్తగూడెం నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఆదివారం కావడంతో విద్యార్థులందరూ హాస్టల్‌లోనే ఉన్నారు. అయితే ప్రమాద సమయంలో గ్రౌండ్‌ఫ్లోర్‌లో స్టడీ అవర్స్‌లో ఉండటంతో పెనుప్రమాదం తప్పింది. కాగా రూ. 30 వేల నష్టం జరిగినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రమాదా ఘటనపై ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఆరా తీశారు.

సెల్ టవర్ వద్ద అగ్నిప్రమాదం



నాగినేనిప్రోలు సెల్ టవర్ వద్ద చెలరేగుతున్న మంటలు

బూర్గంపాడు: నాగినేనిప్రోలు రెడ్డిపాలెంలోని సెల్ టవర్ వద్ద ఆదివారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. సెల్ టవర్ పక్కన ఉన్న పంటచేలలోని వ్యర్థాలను కాలుస్తున్న క్రమంలో మంటలు టవర్ వరకు వ్యాపించాయి. మంటలు అంటుకుని టవర్ ఫైబర్ కేబుల్స్ కాలిపోయాయి. స్థానికుల సమాచారంతో వచ్చిన భద్రాచలం అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. కాగా కేబుల్స్ కాలిపోవటంతో స్నిగల్స్‌కు స్వల్ప అంతరాయం ఏర్పడినట్లు స్థానికులు తెలిపారు.

రాజ్యాంగ పరిరక్షణకు కదలిరావాలి



మాట్లాడుతున్న ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి

కొత్తగూడెంఅర్బన్: దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదకర పరిస్థితిలో ఉందని, రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులంతా కదలిరావాలని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం కొత్తగూడెంలోని కేసీఓఏ క్లబ్‌లో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్య అధ్యక్షతన జరిగిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ జిల్లాస్థాయి సదస్సుల మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తున్న రాజ్యాంగాన్ని తొలగించేందుకు బీజేపీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని విమర్శించారు. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఇరిగేషన్ డెవెలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయబాబు, కాంగ్రెస్ నాయకులు ఆళ్ల మురళి, కొప్పుల చంద్రశేఖర్, చీకటి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

సామాన్యులకు 'ఇసుక' కష్టాలు

- ఇళ్లు నిర్మించుకునేందుకు తప్పని తిప్పలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



లారీలో ఇసుక లోడ్ చేస్తున్న ప్రొక్లెయినర్

మణుగూరు రూరల్ : పక్కనే గోదావరిలో ఇసుక పుష్కలంగా ఉన్నా సామాన్యులకు అందుబాటులో లేకుండాపోయింది. దీంతో ఇంటి నిర్మాణాలకు మణుగూరు మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అదే దళారులకు అడిగినంత చెల్లిస్తే మణుగూరు సబ్ డివిజన్ వ్యాప్తంగా లారీల కొద్దీ ఇసుక సరఫరా చేస్తున్నారు. గతంలో ట్రాక్టర్ ఇసుక రూ.500 నుంచి రూ.800 ఖర్చు చేస్తే, ప్రస్తుతం రూ.2వేల వరకు వెచ్చించాల్సి వస్తోంది. ప్రభుత్వం సంబంధిత శాఖల ద్వారా తక్కువ ధరకు ఇసుక సరఫరా చేయలేకపోవడంతో ప్రజలు దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది. దీంతో ఇసుక దందా జోరుగా సాగుతోంది. మండలంలోని చినరాయిగూడెం, అన్నారం, కొండాయిగూడెం వంటి గోదావరి తీర ప్రాంతాల్లో ఇసుక రీచ్‌లు ఉన్నాయి. ప్రస్తుతం ఇళ్ల కట్టడాలు, ప్రాజెక్టుల పనులు ప్రారంభమవుతుండటంతో ఇసుక డిమాండ్ ఎక్కువే ఉంది. ముందుగా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వారికే ఇసుక సరఫరా చేస్తున్నామని ప్రభుత్వం చెబుతుండగా, ఈ ప్రక్రియలో జాప్యం జరుగుతోంది. దీంతో ఇళ్లు, ఇతర నిర్మాణాలు చేపట్టిన సామాన్య, మధ్య తరగతి ప్రజలు దళారులను ఆశ్రయించి రూ.లక్షలు చెల్లించాల్సి వస్తుందనే ఆరోపణలు ఉన్నాయి. లేకపోతే ఇసుక లేక నిర్మాణాలు నిలిచిపోయే పరిస్థితి ఉంది. నిర్మాణాలకు సిమెంట్, ఐరన్, కంకర కొనుగోలు చేయడం కంటే ఇసుక కొనుగోలు చేయడమే భారంగా మారిందని గృహ నిర్మాణదారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సామాన్యులకు ఇసుక లేకపోవడంతో నిర్మాణాలు అర్థాంతరంగా నిలిపివేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్కువ ధరకే ఇసుక సరఫరా చేస్తామని ప్రభుత్వం చెబుతుందే.. కానీ ఆ దిశగా చర్యలు మాత్రం కనబడడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

ఇసుక లారీ సీజ్

పాల్వంచరూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని రెవెన్యూ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. మండల పరిధిలోని నాగారం గ్రామం నుంచి ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నట్లు తహసీల్దార్ వివేక్ తెలిపారు. శనివారం రాత్రి జగన్నాథపురం వద్ద మట్టిని తరలిస్తున్న మరో రెండు లారీలను పట్టుకుని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

మందుపాతర పేల్చిన మావోయిస్టులు

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో పోలీసు బలగాలను లక్ష్యంగా చేసుకుని ఆదివారం మావోయిస్టులు మందుపాతర పేల్చిన ఘటనలో ఇద్దరు జవాన్లకు తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం వాహనంలో ప్రయాణిస్తున్న పోలీసు బలగాలు అప్రమత్తం కావడంతో మావోయిస్టులు పారిపోయారు. ఎస్టీఎఫ్ విభాగానికి చెందిన పోలీసు బలగాలు కూంబింగ్‌కు వెళ్లి పికప్ వాహనంలో వస్తుండగా బీజాపూర్ - భూపాలపట్నం జాతీయ రహదారిపై మద్దేడు పోలీస్ స్టేషన్ పరిధిలోని గోర్లా సమీపంలో ఈ ఘటన జరిగింది. గాయపడిన ఇద్దరు జవాన్లను బీజాపూర్ జిల్లా కేంద్రానికి తరలించి చికిత్స నిర్వహిస్తున్నారు.